



భారత్ రైస్ ఎక్కడ?

- జిల్లాలో కనిపించని కేంద్రాలు
- రూ.29కే సన్నబియ్యమంటూ కేంద్రం ప్రచారం
- ఇంకా విధి విధానాలు రాలేదంటున్న ఎఫ్‌సీఐ
- ఎదురుచూస్తున్న సామాన్య జనం



మహబూబాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : బియ్యం ధరలు రోజు రోజుకు ఆకాశాన్నంటుతుండడంతో పేద ప్రజల కోసం భారత్ రైస్ పేర కేంద్ర ప్రభుత్వం అందిస్తామని ప్రకటించింది. ఈ నేపథ్యంలో మహబూబాబాద్ జిల్లాలో అలాంటి భారత్ రైస్ విక్రయ కేంద్రాలు ఎక్కడా కనిపించడం లేదు. సన్నబియ్యం కిలో రూ.29కే అందిస్తామని చెప్పి 50 రోజులు కావొస్తున్నా ఆ బియ్యం కేంద్రాల జాడే ఇప్పటి వరకు లేదు. తక్కువ ధరకు సబ్సిడీ బియ్యం ఎప్పుడు వస్తాయా.. అని సామాన్యులు, నిరుపేదలకు ఎదురుచూపులు తప్పడం లేదు.

కొద్ది నెలల క్రితం నుంచి ధాన్యం ధరలు పెరుగుతుండడంతో బియ్యం ధరలు కూడా పోటీ పడుతూ.. అమాంతం పెరుగుతున్నాయి. నీటి సమస్య తీవ్రతరం కావడంతో వరి విస్తీర్ణం రాష్ట్రంలో తగ్గిపోయింది. దీంతో ముందే ఊహించిన వ్యాపారులు ధాన్యం ధరలు పెంచేసి తమకు అనుకూలంగా ఉన్న మండల కేంద్రాల నుంచి ధాన్యం కొనుగోలు చేసి గోదాంలలో దాచుకున్నారు. నాగార్జునసాగర్ ఆయకట్టు కింద పండించిన సన్నధాన్యం ద్వారా తయారైన బియ్యాన్ని అత్యధికంగా హైదరాబాద్ మహానగరానికి సరఫరా చేసేవారు. అలాంటిది నాగార్జునసాగర్‌లో ఈ ఏడాది నీటి నిల్వలు తగ్గిపోవడంతో వరి విస్తీర్ణం బాగా తగ్గింది. ఫలితంగా బియ్యానికి సంక్షోభం ఏర్పడుతుండడంతో వ్యాపారులు సన్నధాన్యం కొనుగోలుకు పక్క మండలాలు, రాష్ట్రాల వైపు ఖరీదులకు మొగ్గు చూపారు. మహబూబాబాద్ జిల్లాలోని కేసముద్రం లాంటి వ్యవసాయ మార్కెట్‌కు అత్యధికంగా ఎన్నడూలేని విధంగా ధాన్యం విపరీతంగా వస్తుండడంతో ఆ మార్కెట్‌పై వ్యాపారుల దృష్టి పడింది. వారితో పాటు పక్క రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు కూడా కేసముద్రం మార్కెట్ వ్యాపారులకు కమీషన్ ఇచ్చి సన్నధాన్యం కొనుగోళ్లు చేపట్టారు. గత వానాకాలంలో పండించిన సన్నధాన్యం కేసముద్రం మార్కెట్‌కు విపరీతంగా వస్తుంది. రోజుకు 20-30 లారీల వరకు సన్నధాన్యం ఖరీదు చేసిన ఇక్కడి వ్యాపారులు నల్గొండ, సూర్యాపేట, కాకినాడ, మండపేట, చెన్నై, నాగ్‌పూర్ లాంటి ప్రాంతాలకు ఎగుమతి చేశారు.

బియ్యం ధరలు ఇలా...

జిల్లాలో సన్నధాన్యానికి డిమాండ్ ఏర్పడడంతో బియ్యం ధరలు పెరిగి పోతున్నాయి. నిన్న, మొన్నటి వరకు జైశ్రీరాం బియ్యం కొత్తవి క్వింటాకు రూ.5,500 వరకు విక్రయించగా గత రెండ్రోజుల నుంచి ఆ బియ్యం ధరలు తగ్గుముఖం పట్టాయి. జైశ్రీరాం కొత్త బియ్యం ధరలు ప్రస్తుతం రూ.5,100 వరకు విక్రయిస్తున్నారు. ఆర్ఎన్ఆర్, బీపీటీ, హెచ్ఎంటీ రకాలు(కొత్తవి) క్వింటాకు రూ.4,600 నుంచి రూ.4,800 విక్రయించినప్పటికి ప్రస్తుతం రూ.4,200 వరకు అమ్ముతున్నారు. అయితే పాత బియ్యం ధరలు మాత్రం రోజు రోజుకు పెరుగుతున్నాయి. జైశ్రీరాం పాతవి క్వింటాకు రూ.7,200 వరకు పలుకుతుండగా, ఆర్ఎన్ఆర్, హెచ్ఎంటీ, బీపీటీ రకాలు రూ.6,200 వరకు విక్రయిస్తున్నారు.

భారత్ రైస్ పేరుతో...

ధరలు పెరుగుతుండడంతో సామాన్యులకు బియ్యం కొనుగోళ్లు పెద్ద సమస్యగా మారింది. పెరిగిన ధరలతో బియ్యం కొనుగోలు చేయలేక రేషన్ బియ్యం తినలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. సామాన్యుల బాధలు గుర్తించిన కేంద్ర ప్రభుత్వం వారికి సన్నబియ్యం అందించాలన్న లక్ష్యంతో భారత్ రైస్ పేరిట కిలో రూ.29కే విక్రయించాలని నిర్ణయించింది. గత ఫిబ్రవరి 7న ఈ పథకం ప్రారంభిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 5కిలోలు, 10 కిలోల సంచి పేరిట విక్రయించడానికి ప్రభుత్వం నిర్ణయించింది. నాఫెడ్, కేంద్రీయ బండార్, ఎన్‌సీసీఎఫ్ కేంద్రాల్లో కొనుగోలు చేసుకోవచ్చని కేంద్రం ప్రచారం చేసింది. అయితే ఇప్పటి వరకు ఏ విక్రయ కేంద్రాలు జిల్లాలో ఏర్పాటు చేయలేదు. కేంద్రం ప్రకటించి 48 రోజులు గడుస్తున్నప్పటికి మహబూబాబాద్ జిల్లాలో భారత్ రైస్ పేరిట షాపులు ఎక్కడా కనిపించలేదు. ఇలాంటి బియ్యం అమ్మకాలపై జిల్లా సివిల్‌సప్లై అధికారి రాజేందర్‌ను వివరణ కోరగా రూ.29కే బియ్యం విక్రయించాలని కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు తమకు అందలేదని, ఇప్పటి వరకు ఈ పథకం గురించి స్పష్టంగా తెలియదని చెబుతున్నారు. అలాగే ఎఫ్‌సీఐ ఉన్నతాధికారులను ప్రశ్నించగా త్వరలోనే బియ్యం కేంద్రాలు ప్రారంభమయ్యే అవకాశం ఉందని, కేంద్రం నుంచి విధి విధానాలు, ఉత్తర్వులు తమ శాఖకు అందలేదని స్పష్టం చేశారు. కాగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు కూడా ఎలాంటి సమాచారం లేకపోవడంతో ఇది ఎన్నికల జిమ్మిక్కునే కావచ్చంటూ పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రజలు మాత్రం తక్కువ ధరకే సన్నబియ్యం వస్తుందనే ఆశతో కొనుగోలు కేంద్రాలు ఎప్పుడు ప్రారంభమవుతాయని ఎదురుచూస్తున్నారు.

సమ్మర్ యాక్షన్ ప్లాన్ రూపొందించాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు, పట్టణాల్లో అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి తాగునీటి ఎద్దడి లేకుండా సరఫరా చేసేందుకు సమ్మర్ యాక్షన్ ప్లాన్‌ను రూపొందించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశించారు. మహబూబాబాద్‌లోని కలెక్టరేట్‌లో గురువారం తాగునీటి సరఫరా వనరులపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి వనరులను ఉపయోగించుకుని ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖ, ఎంపీడీవోలు, అసిస్టెంట్ ఇంజనీర్లు, మండల ప్రత్యేకాధికారులు సమన్వయంతో ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. తాగునీటి సమస్య అధికంగా ఉన్నచోట ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. మునిసిపల్ పరిధిలోని వార్డుల్లో తాగునీటి సమస్యను అధిగమించడానికి నీటి వనరులను వినియోగించుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో, అధికారులు హరి ప్రసాద్, రమాదేవి, కృష్ణారెడ్డి, సురేందర్ పాల్గొన్నారు.

మూడు మండలాల్లో ఆకస్మిక పర్యటన..

జిల్లాలోని కేసముద్రం, నెల్లికుదురు, ఇనుగుర్తి మండలాల్లో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆకస్మికంగా పర్యటించారు. కేసముద్రం మండలం కోమటిపల్లి హైస్కూల్‌లో పదవ తరగతి పరీక్షల సరళిని పరిశీలించారు. కేసముద్రం, నెల్లికుదురు, ఇనుగుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా క్షేత్ర స్థాయిలో వైద్య, ఆరోగ్య శాఖ సేవలు అందించాలని, పీహెచ్‌సీల్లో వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. నెల్లికుదురు కేజీబీవీని సందర్శించి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాబోధన చేసేందుకు సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. కేసముద్రం, నెల్లికుదురు, ఇనుగుర్తి తహసీల్దార్ కార్యాలయాలను సందర్శించి ప్రజలకు సత్వర సేవలు అందించాలని, రికార్డులు పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. వేసవి కాలంలో జిల్లా వ్యాప్తంగా ప్రజలకు తాగునీరు అందించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో డీఈవో రామారావు, డీపీవో హరి ప్రసాద్, తహసీల్దార్లు దామోదర్, రాజు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

వివరాలు 8లో..



బయ్యారం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్

ప్రశాంతంగా మానుకోట 'బార్' అసోసియేషన్ ఎన్నిక

- అధ్యక్షుడిగా పద్మాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కృష్ణ



కీసర పద్మాకర్‌రెడ్డి, అధ్యక్షుడు



సంద కృష్ణ, ప్రధాన కార్యదర్శి

మహబూబాబాద్ రూరల్, మార్చి 28: మహబూబాబాద్ జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికను గురువారం ప్రశాంతంగా పూర్తి చేసినట్లు ఎలక్షన్ ఆఫీసర్ కొంపెల్లి వెంకటయ్య, అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్ కమల్‌కుమార్ తెలిపారు. అధ్యక్షుడిగా కీసర పద్మాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా భట్టు కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా సంద కృష్ణ, సహాయ కార్యదర్శిగా చిన్న మహేందర్, లైబ్రె రి కార్యదర్శిగా వి.హరికృష్ణ, కోశాధికారిగా టి.సునీత, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా కె.మున్నా, కార్యవర్గ సభ్యులుగా రాజమణి, మౌనిక, సరితలను ఎన్నుకున్నట్లు చె ప్పారు. మహబూబాబాద్‌లోని జిల్లా కోర్టు ఆవరణలో ఉదయం 11 నుంచి సా యంత్రం 4 గంటల వరకు 76 మంది న్యాయవాదులు ఓటు హక్కును వినియోగిం చుకున్నారు. బరిలో నిలిచిన కీసర పద్మాకర్‌రెడ్డికి 56 ఓట్లు, తుంపిళ్ల శ్రీనివాస్‌కు 20 ఓట్లు వచ్చాయి. 36 ఓట్ల మెజారిటీతో పద్మాకర్‌రెడ్డి గెలుపొందినట్లు ఎన్నికల అధికా రులు కొంపెల్లి వెంకటయ్య, కమల్‌కుమార్ ప్రకటించారు.

తొర్రూరు బార్ అసోసియేషన్ కార్యవర్గం



కె.ప్రవీణ్‌రాజు, అధ్యక్షుడు



జి.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి

తొర్రూరు, మార్చి 28: తొర్రూరు బార్ అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఎన్నికల అధికారులు రావుల రఘురాంరెడ్డి, వల్లపు అయిలోని తెలిపారు. తొ ర్రూరులోని కోర్టు ఆవరణలో గురువారం జరి గిన సమావేశంలో బార్ అసోసియేషన్ నూ తన అధ్యక్షుడిగా కల్వకొలను ప్రవీణ్‌రాజు, ప్ర ధాన కార్యదర్శిగా గణపురం రామకృష్ణ, ఉపా ధ్యక్షుడిగా అలువాల శ్రీశైలం, ట్రెజరర్‌గా టి.సై దులు, జాయింట్ సెక్రెటరీగా టి.కృపావతితో పాటు ఎం.నాగరాజు, జి.విజయ, బి.కు మార్‌లను ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎంపిక చేశామన్నారు. ఈ సందర్భంగా నూత న అధ్యక్షుడు ప్రవీణ్‌రాజు మాట్లాడుతూ బార్ అసోసియేషన్ సభ్యుల సంక్షేమానికి కృషి చేస్తానని, ఆ ప్రాంత ప్రజలకు విలువలతో కూడిన న్యాయ సేవలను అంది స్తానని తెలిపారు. సమావేశంలో సీనియర్ న్యాయవాదులు బండపల్లి వెంకన్న, వల్లపు మహేష్, మధుసూదన్, యాకాంబ్రం, నగేష్, శ్రీనివాస్, లాలు, భాస్కర్, యాకేందర్, ప్రవీణ్, వెంకటేశ్వర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచాలి

డిప్యూటీ డీఎంహెచ్‌వో అంబరీష



ముల్కనూరు పీహెచ్‌సీలో హాజరు పట్టికను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో అంబరీష

గార్ల, మార్చి 28 : ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాల శాతం పెంచి గర్భిణులకు నమ్మకం కలిగించాలని డిప్యూటీ డీఎం హెచ్‌వో డాక్టర్ అంబరీష అన్నారు. మండలంలోని ముల్కనూరు పీహెచ్‌సీని గురువారం తనిఖీ చేసి సిబ్బంది పనితీరు, రికార్డులను పరిశీలించారు. పనితీరు మెరుగు పర్చుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో గర్భిణుల నమోదును పూర్తి చేయాలన్నారు. అసంక్రమిత వ్యాధులైన బీపీ, షుగర్, క్యాన్సర్ పరీక్షలను 30 సంవత్సరాలు పైబడిన వారందరికి చేసి టీకాలు, మందులు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కృష్ణార్జున్‌రావు, వడ్డెబోయిన శ్రీనివాస్ రావు, డాక్టర్ సద్విజ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వేసవిలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి

డోర్నకల్ : ప్రస్తుత వేసవి కాలంలో ఎండల తీవ్రత అధికంగా ఉంటుం దని, ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మానుకోట డిప్యూటీ డీఎం హెచ్‌వో అంబరీష సూచించారు. ఈ దిశగా ఆరోగ్య కార్యకర్తలు ప్రజలను చైతన్యం చేయాలని అన్నారు. డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలోని సీహెచ్‌సీ ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. అన్ని హెల్త్ సబ్‌సెంటర్లలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందు బాటులో ఉంచుకోవాలన్నారు. నేషనల్ హెల్త్ ప్రోగ్రాంలను విజయవంతం చేయాలని తెలిపారు. ఆయన వెంట వైద్యులు సాద్విజ, వడ్డెబోయిన శ్రీనివాస్, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

వేసవిలో ఉద్యాన పంటలు వేసుకోవాలి

జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి మరియన్న



సీరోలు మండలంలో అంతర పంటలను పరిశీలిస్తున్న ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ అధికారి మరియన్న

మహబూబాబాద్ అగ్రికల్చర్, మార్చి 28 : వేసవిలో ఉద్యాన పంటలు వేసి అధిక లాభాలు పొందాలని జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న రైతులకు సూచించారు. జిల్లాలోని కురవి, సీరోలు, డోర్నకల్, మహబూబాబాద్ మండలాల్లో ఆయిల్‌పామ్, డ్రాగన్ ఫ్రూట్, మామిడి, జామ, కూరగాయల తోటలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మరియన్న మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటలుగా టమాట, మిర్చి, బీర, వంగ, గోరుచిక్కుడు, బెండ, ఉల్లిగడ్డ, బీట్‌రూట్, ఆకు కూరలు, కొత్తిమీర, పూదీన లాంటి వాటిని సేంద్రీయ పద్ధతిలో సాగు చేసుకుంటే లాభదాయకంగా ఉంటుందన్నారు. వర్మికంపోస్టు, వేపపిండి, కానుగ పిండి, వేపనూనె వాడితే పంటల దిగుబడి అధికంగా రావడమే కాకుండా 30-40 శాతం దిగుబడి పెరుగుతుందని తెలిపారు. ఆ పంటల ద్వారా ఆరోగ్యం మంచిగా ఉంటుందన్నారు. సమీకృత వ్యవసాయాన్ని ఆధునిక పద్ధతుల్లో చేపట్టాలని, రైతు ఉత్పత్తి సమాఖ్యలుగా ఏర్పడి పంట కాలనీలను ఏర్పాటు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

భగ్గుమంటున్న ఎండ

- భానుడి భగభగలతో బెంబేలెత్తుతున్న ప్రజలు
- మార్చి చివరాంకంలోనే 40 డిగ్రీలకు చేరువ
- ఐదు రోజుల్లో మరింత పెరుగుతాయంటున్న వాతావరణ శాఖ
- జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారుల విజ్ఞప్తి





మధ్యాహ్నం ఎండ తీవ్రతతో నిర్మానుష్యంగా జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లు

మహబూబాబాద్ టౌన్, మార్చి 28: వేసవి కాలం ఆరంభం నుంచే ఎండలు టారెత్తిస్తున్నాయి. గత నాలుగైదు రోజుల నుంచి ఎండలు పెరుగుతూ వస్తున్నాయి. మార్చి చివరాంకంలోనే 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయంటే ఏప్రిల్, మే మాసంలో పరిస్థితి ఏంటని ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. గత ఏడాది కంటే ఈ సంవత్సరం ఎండలు తీవ్రంగా ఉండే అవకాశం లేకపోలేదు. మార్చి నెలలో ఎండలు పెరగడం, వడగాలులు వీస్తుండడంతో ప్రజలు ఉపశమనం పొందేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. ఏప్రిల్ మాసం వరకే వివాహాది శుభ కార్యాలుండడంతో మంచి ముహూర్తాల్లో పెళ్లిళ్లు అధిక సంఖ్యలో జరుగుతుండడంతో హాజరయ్యేందుకు బంధువులు, స్నేహితులు ఎండలో అల్లాడిపోతున్నారు. ప్రయాణాల్లో, ఫంక్షన్ హాళ్లలో ఉక్కపోతతో చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు.

ఉదయం 9 గంటల నుంచి..

తెల్లవారు జామున కాస్త చల్లబడ్డప్పటికి ఉదయం 9 గంటలయ్యే వరకు ఎండలు తీవ్రమై సాయంత్రం 5 గంటల వరకు మండుతున్నాయి. దీంతో ప్రజలు బయటకు రావాలంటే జంకుతున్నారు. ఏమైనా పనులు ఉంటే ఉదయం 9 గంటల లోపే ముగించుకుని సాయంత్రం 5 తర్వాత బయటకు వస్తున్నారు. అత్యవసర సమయాల్లో బయటకు రావాలంటే గొడుగులు, టోపీల సహాయంతో బటయకు వస్తున్నారు. మిట్ట మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో సూరీడు తన ప్రతాపాన్ని చూపిస్తుండడంతో పట్టణంలోని రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. వేసవి ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు శీతల పానీయాలు నిమ్మరసం, జ్యూస్ పాయింట్‌ల వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారు.

జిల్లాలో ఐదు రోజుల్లో నమోదైన ఉష్ణోగ్రతలు(డిగ్రీలలో..)

తేది	కనిష్ఠ	గరిష్ఠ
24న	23.2	40.6
25న	22.3	38.8
26న	21.0	39.5
27న	20.2	39.8
28న	22.4	39.2

మరో ఐదు రోజులు ఎండలు తీవ్రమై మరో 3 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు పెరగనున్నాయని హైదరాబాద్ వాతావరణ శాఖ ప్రకటించింది. ప్రతి ఏటా ఏప్రిల్ చివరాంకంలో నమోదయ్యే 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు చరిత్రలో ఎన్నడూలేని విధంగా మార్చి చివరి వారంలోనే నమోదు కావడంతో ప్రజల్లో భయాందోళన మొదలైంది.

జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యాధికారులు

రోజు రోజుకు ఎండలు తీవ్రతరం కావడం, మరో ఐదు రోజులు ఉష్ణోగ్రతలు పెరగనున్నాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. ఎండదెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తగు సూచనలు చేస్తున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రావద్దని సూచిస్తున్నారు. ఆ సమయంలో విశ్రాంతి తీసుకోవాలని చెబుతున్నారు. ప్రతి ఆరోగ్య కేంద్రం, ఉప కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ ఆస్పత్రులు, గ్రామ పంచాయతీల్లో ఉచితంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అంటుబాటులో ఉంటాయని జిల్లా వైద్యాధికారి కళావతిబాయి తెలిపారు.

వైద్యాధికారులు సూచిస్తున్న జాగ్రత్తలు

- ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు బయట తిరగడం, ఆడడం చేయొద్దు.
- తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపి, తెల్లని రుమాల్ ధరించాలి.
- నీరు, ద్రవ పదార్థాలు వీలైనంత ఎక్కువగా తీసుకోవాలి.
- ఇంటి వద్ద ఉండే పిల్లలు, 60 ఏళ్ల పైబడిన వారు, అనారోగ్యంతో బాధపడే వారు తరుచుగా తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తాగాలి.
- నోరు ఎండకు ఎండుకపోవడం, దాహం వేయడం లాంటి లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలి.
- వేసవిలో తెల్లని నూలు వస్త్రాలు ధరించాలి.
- మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లకుండా ఇంట్లోనే విశ్రాంతి తీసుకోవాలి.



ఆర్‌ఎంపీలు.. డాక్టర్ అనే పదం వాడొద్దు

వరంగల్ మెడికల్, మార్చి 28: ప్రథమ చికిత్స చేసే వ్యక్తులు తమ పేరు ముందు డాక్టర్ అనే పదాన్ని వాడరాదని హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నోటీసులు జారీ చేశారు. ఇలాంటి వ్యక్తులు చేసే వైద్య సహాయ కేంద్రం ముందు ఫస్ట్ ఎయిడ్ సెంటర్, ప్రథమ చికి త్స కేంద్రమని మాత్రమే రాయాలని సూచించారు. తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ 2010 (రూల్ 2011) ఎవరూ అతిక్రమించినా చట్టరీత్యా చర్యలు తప్పవని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి హెచ్చరించారు.


హనుమకొండ జూపార్క్‌లో ఆస్ట్రిచ్‌పక్షులకు నీరు కొడుతున్న సంరక్షకుడు


చిరుతపులి బ్యారక్‌ఎదుట కూలర్ ఏర్పాటు చేసిన దృశ్యం

వణ్యప్రాణులకు వేసవి తాపం

ఎండలు మండుతున్నాయి. జనమే కాదు పశుపక్షాదులూ ఎండతీవ్రతకు అల్లాడుతున్నాయి. గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో సగటున గరిష్ఠంగా 38డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవగా.. మధ్యాహ్నం సమయంలో రహదారులు, కూడళ్లలో అంతగా జనసంచారం కనిపించలేదు. ఇక ప్రజలు శీతలపానీయాలను ఆశ్రయిస్తున్నారు. ఈనేపథ్యంలో హనుమకొండలోని వనవిజ్ఞాన్ కేంద్రం జూపార్క్‌లో చిరుతపులి ఉండే బ్యారక్‌కు పరదాలు, కూలర్ ఏర్పాటు చేయగా.. ఆస్ట్రిచ్ పక్షులకు, ఇతర జంతువులు, పక్షులు ఉండే బోన్ల చుట్టూ పరదాలు కట్టి సంరక్షకులు నీటితో తడుపుతున్నారు.

- ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్, హనుమకొండ

ఉద్యోగాల పేరిట మోసం

రూ.5కోట్ల వసూలు

పోలీసుల అదుపులో నిందితుడు?

వరంగల్ క్రైం, మార్చి 28: ఉద్యోగాల పేరిట మోసం చేసి రూ.5కోట్లు వసూలు చేసిన నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. నలుగురు ముఠాగా ఏర్పడి గ్రూప్-1 ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసి హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్ జిల్లాలకు చెందిన పలువురు నిరుద్యోగుల నుంచి రూ.5కోట్ల వరకు వసూలు చేసినట్లు తెలిసింది. ఈ విషయమై వరంగల్ పోలీసులకు సమాచారం అందడంతో నగరానికి చెందిన ఒక వ్యక్తిని గురువారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అదుపులోకి తీసుకున్న నిందుతుడిని రహస్యంగా విచారిస్తున్నట్లు సమాచారం. కమిషనరేట్ కార్యాలయం సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో పెట్టి నిందితుడి నుంచి వాస్తవాలు సేకరించినట్లు తెలిసింది. పోలీసుల అదుపులో ఉన్న నిందితుడి కుమారుడితోపాటు మరో ఇద్దరు ఈ మోసంలో భాగస్వాములుగా ఉన్నట్లు పోలీసుల తమదైన శైలిలో చేసిన విచారణలో బహిర్గతమైనట్లు సమాచారం. ఇంకా పూర్తిస్థాయి విచారణ చేసి శుక్రవారం పోలీసులు వివరాలు వెల్లడించే అవకాశం ఉంది.

వాహనదారులకు జరిమానా

హనుమకొండ టౌన్, మార్చి28: డ్రంక్ అండ్ డ్రైవ్‌తో పాటు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడ్డ 22మంది వాహనదారులకు జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ షూకూర్ తెలిపారు. గురువారం 22 మందిని కోర్టులో హాజరుపరచగా డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 18 మందికి రూ.22,100, డ్రైవింగ్ లైసెన్స్ లేని కేసులో ఐదుగురికి రూ.3,100 జరిమానాను న్యాయమూర్తి రమేశ్ విధించారన్నారు.

బైక్ ఢీకొని వృద్ధుడికి గాయాలు

హనుమకొండ టౌన్, మార్చి28: ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధుడికి గాయాలైన సంఘటన బుధవారం సాయంత్రం పోలీస్ హెడ్‌క్వార్టర్ ఎదుట చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... లోటస్ కాలనీ చెందిన ఎస్.ఉపేందర్ (65) బుధవారం హెడ్‌క్వార్టర్ జంక్షన్‌లో రోడ్డు క్రాస్ చేస్తుండగా మాడిశెట్టి షణ్ముక అనే వ్యక్తి ద్విచక్రవాహనంతో నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ ఢీకొట్టగా ఉపేందర్‌కు కుడికాలు, చేతికి గాయాలయ్యాయి. బాధితుడి మనవడు సోమ సాయిశరత్ హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

బస్సులో మరిచిపోయిన చీరలను అందజేసిన పోలీసులు

హనుమకొండ టౌన్, మార్చి28: హనుమకొండ బస్టాండ్‌లో బస్సులో మరిచిపోయిన చీరల బ్యాగును తిరిగి బాధితుడికి పోలీసుల అందజేశారు. పోలీసులకు కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలుకు చెందిన ఓ ప్రయాణికుడు చీరెల బ్యాగుతో హైదరాబాద్‌కు వెళ్లేందుకు మంగవారం సాయంత్రం హనుమకొండ బస్టాండ్‌కు చేరుకున్నాడు. హైదరాబాద్‌కు వెళ్లేందుకు ముందుగా శ్రీశైలం బస్సు ఎక్కి తర్వాత మరో బస్సు రాగానే చీరెల బ్యాగును మరిచిపోయి ఆ బస్సు ఎక్కాడు. అయితే చీరెల బ్యాగు గుర్తుకొచ్చి మొదటి బస్సు వద్దకు వెళ్లగా.. ఆ బస్సు వెళ్లిపోయింది. బాధితుడు వెంటనే హనుమకొండ పోలీసులను ఆశ్రయించగా సీసీ ఫుటేజీల ఆధారంగా బస్సును గుర్తించి డ్రైవర్‌కు సమాచారం చేరవేశారు. తిరుగుప్రయాణంలో చీరెల బ్యాగును తీసుకొచ్చి పోలీసుల సమక్షంలో బుధవారం రాత్రి బాధితుడికి అందజేశాడు. కాగా చీరెల విలువ రూ.50,000 ఉంటుందని పోలీసులు తెలిపారు.

మృతదేహం లభ్యం

మడికొండ, మార్చి 28 : మడికొండలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించింది. స్థానిక ఎస్సై రాజబాబు తెలిపిన వివరాల మేరకు.. మడికొండలోని శ్రీరామ బార్ సమీపంలోని ఓ లాండ్రీ షాప్ వెనుక ఖాళీ స్థలంలో ఓ వ్యక్తి డ్రాయర్ మాత్రమే ధరించి బట్టలు లేకుండా బోర్లా పడి మృతి చెంది ఉన్నాడు. అక్కడ ఉండే వారిని విచారించగా సదరు వ్యక్తి రెండు, మూడు రోజులుగా అక్కడే తిరుగుతున్నాడని, ఇతర రాష్ట్రానికి చెదిన వాడై ఉంటాడని, హిందీలో మాట్లాడేవాడని చెప్పినట్లు తెలిపారు. మృతుడు ఆహారం లేక అలసిపోయి శరీరంలో ఓపిక లేక అలాగే ముందుకు పడిపోయి చనిపోయి ఉంటాడని తెలిపారు. కేసు నమోదు చేసి మార్చురీకి తరలించినట్లు ఎస్సై వెల్లడించారు. ఆచూకీ తెలిసిన వారు సెల్. 87126 85123, 87126 85248 నెంబర్లకు సమాచారం అందజేయాలని కోరారు.

పని బారెడు.. జీతం చారెడు..

● ఉపాధి క్షేత్ర సహాయకులపై పని భారం ● పెరిగిన పంచాయతీలు.. పెరగని ఫీల్డ్ అసిస్టెంట్లు
● 1,680 పంచాయతీలకు 800 మందే విధులు ● ఒక్కొక్కరికి మూడు నాలుగు పంచాయతీలు




హనుమకొండ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకంలో క్షేత్ర సహాయకులపై పని భారం రోజు రోజుకు పెరుగుతోంది. వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో 1,668 గ్రామ పంచాయతీలు ఉండగా, క్షేత్ర సహాయకులు మాత్రం 800 మంది వరకే ఉన్నారు. మొదట్లో 1,018 మంది క్షేత్ర సహాయకులు ఉండేవారు. కొందరు మధ్యలో ఉద్యోగం మానేశారు. మరికొందరు వివిధ కారణాల వల్ల ఉద్యోగాల నుంచి తొలగింపబడ్డారు. కొంత మంది మరణించారు. దీనితో క్షేత్రసహాయకుల సంఖ్య క్రమంగా తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతం ఉన్నవారిపైనే పని భారం పడుతోంది.

క్షేత్ర సహాయకుల కొరత

గత బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లాలు, మండలాలు, గ్రామ పంచాయతీల పునర్విభజన చేపట్టింది. 500 మించి జనాభా కలిగిన తండాలను సైతం గ్రామ పంచాయతీలుగా మార్చింది. దీనితో ఉమ్మడి వరంగల్ జిల్లాలో గ్రామ పంచాయతీల సంఖ్య 1080 నుంచి 1,668 వరకు పెరిగింది. పెరిగిన గ్రామ పంచాయతీలకు అనుగుణంగా క్షేత్ర సహాయకుల సంఖ్యను పెంచలేదు. గ్రామ పంచాయతీలు పెరగక ముందు గతంలో ప్రతీ పాత గ్రామపంచాయతీకి ఒక్కరు చొప్పున క్షేత్ర సహాయకులుఉ ఉండేవారు. ప్రభుత్వం గ్రామ పంచాయతీలను పెంచింది కానీ.. ఆ మేరకు క్షేత్ర సహాయకులను మాత్రం పెంచలేదు. ప్రస్తుతం పాత పంచాయతీల్లో పని చేస్తున్నవారికే కొత్తపంచాయతీల బాధ్యతలను కూడా అప్పగించింది. దీనితో ఒక్కో క్షేత్ర సహాయకుడు పెద్ద పంచాయతీలు అయితే రెండు, మూడు.. చిన్న పంచాయతీలైతే నాలుగైదు వరకు చూసుకోవలసి వస్తోంది. దీంతో వారిపై పని భారం పెరిగి సతమతమవుతున్నారు. ఉపాధి పనుల అమలును సరిగా పర్యవేక్షించలేని పరిస్థితి ఏర్పడుతోంది. క్షేత్రసహాయకుల కొరత వల్ల కొన్ని పంచాయతీల్లో కార్యదర్శులు కూడా ఉపాధి పనులను చూస్తున్నారు.

పని భారం

తమను క్రమబద్ధీకరించాలంటూ సమ్మెకు దిగిన క్షేత్ర సహాయకులను గత ప్రభుత్వం విధుల నుంచి తొలగించింది. వారు పెద్ద ఎత్తున ఆందోళన చేయడంతో వీరిని మళ్లీ విధుల్లోకి తీసుకున్నది. అయినప్పటికీ పంచాయతీకి ఒకరు చొప్పున క్షేత్రసహాయకులను నియమించలేదు. ఒక్కడే క్షేత్ర సహాయకుడు మూడు నాలుగు గ్రామపంచాయతీల్లో ఉపాధిహామీ పనులను పర్యవేక్షించాల్సి రావడం వల్ల కూలీల హాజరు నమోదు కష్టంగా మారుతోంది. కూలీల ఫొటోలను అప్‌డేట్ చేయలేకపోతున్నాడు. దీంతో క్షేత్రసహాయకులు చేసేది లేక ఒక గ్రామాన్ని వారు చూసుకుంటూ మిగిలిన గ్రామాల్లో హాజరు నమోదు బాధ్యతను కూలీల్లో ఒకరికి అప్పగిస్తున్నారు. ఇలా చేయడంతో పనులకు హాజరుకాని వారికి కూడా హాజరు వేసే అవకాశముంటుంది.

కొత్త సాఫ్ట్‌వేర్‌తో తిప్పలు

ఉపాధి హామీ పథకంలో భాగంగా గతంలో రాష్ట్రప్రభుత్వం రూపొందించిన సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించేవారు. అన్ని రాష్ట్రాల్లో సాఫ్ట్‌వేర్లు ఒకేలా ఉండాలని కేంద్రం ఆదేశించడంతో రెండేళ్లుగా కొత్తదానిని ఉపయోగిస్తున్నారు. ఈసాఫ్ట్‌వేర్‌తో గందరగోళ పరిస్థితి ఏర్పడుతోంది. పాత పంచాయతీ నుంచి విడిపోయి కొత్తగా ఆవిర్భవించిన వాటిలో కూలీలకు చెల్లింపులు ఆలస్యమవుతున్నాయి. కూలీల పేర్లు రెండు పంచాయతీల్లో నమోదు కావడంతో అధికారులు వాటిని వేరు చేశారు. అప్పుడు క్షేత్ర సహాయకులు లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శులే పనులు పర్యవేక్షించారు. కేంద్రం తీసుకొచ్చిన కొత్త సాఫ్ట్‌వేర్ ప్రకారం పంచాయతీలు యూనిట్‌గా పనులు గుర్తించారు. అలాంటప్పుడు ఈ పంచాయతీకి ఒకరు చొప్పున క్షేత్ర సహాయకుడు ఉండాలి. కానీ అలా జరగడం లేదు. అన్ని చోట్ల కూలీల హాజరు నమోదు, క్షేత్ర స్థాయిలో చిత్రాలను అప్‌లోడ్ చేయడం కష్టంగా మారుతోంది. క్షేత్ర సహాయకులు తమకు అప్పగించిన పంచాయతీలకు వెళితేనే ఆ సాఫ్ట్‌వేర్ కూలీల హాజరు నమోదు అవుతుంది. దీంతో ఒక క్షేత్ర సహాయకుడు తనకు అప్పగించిన మూడు నాలుగు గ్రామ పంచాయతీలకు స్వయంగా వెళ్లి ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా కూలీల హాజరు నమోదు చేయడం ఇబ్బందిగా మారుతోంది. ఈ మూడునెలలు ఉపాధి పనులు జోరుగా సాగుతాయి. పైగా వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు సరిగా పండక, పండిన పంటలు ఎండిపోయి వ్యవసాయ కూలీలకు పనులు దొరకని పరిస్థితులు ఏర్పడనున్న దృష్ట్యా ఉపాధి పనులకు ఎక్కువ మంది వచ్చే అవకాశం కూడా ఉన్నది.

వెట్టిచాకిరీ

చాకిరి బారెడు.. వేతనం చారెడు చందంగా ఉంది క్షేత్ర సహాయకుల పరిస్థితి. వారికి ఇచ్చే వేతనం అతి తక్కువ. కానీ పని భారం మాత్రం అధికంగా ఉంటోంది. ప్రస్తుతం క్షేత్ర సహాయకులకు రూ.10,500 ఇస్తున్నారు. ఇందులో కోతలు పోను వారి చేతికి అందేది రూ.8900 మాత్రమే. ఇందులోనూ కూడా ఇంకా కోతలు విధిస్తున్నారు. గ్రామ పంచాయతీలో 30 శాతానికిపైగా కూలీలు ఉపాధి పనులకు వచ్చేట్లు చేస్తేనే పూర్తి వేతనం ఇస్తారు. ఇది ఏ మాత్రం తగ్గిన వేతనంలో కోత పెడుతున్నారు. ఈ నిబంధన క్షేత్ర సహాయకులకు తీవ్ర నష్టం కలిగిస్తోంది. వ్యవసాయ పనులు ముమ్మరంగా జరిగినప్పుడు ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్య సహజంగానే తగ్గుతుంది. పైగా చిన్న పంచాయతీల్లో జాబ్ కార్డు కలిగిన కూలీలు తక్కువగా ఉంటారు కనుక పెద్దగా సమస్య ఉండడం లేదు. కానీ అదే 3500 నుంచి 4000 వరకు జాబ్ కార్డులున్న పెద్ద పంచాయతీల్లో 30శాతం మించి కూలీల హాజరు ఉండేట్లు చూడడం క్షేత్ర సహాయకులకు కష్టంగా మారుతోంది. ఈ నిబంధనను ఎత్తి వేయాలని వారు కోరుతున్నారు.

మూడు నెలలుగా వేతనాలు లేవు

క్షేత్ర సహాయకులకు వేతనాలు కూడా సకాలంలో అందడం లేదు. డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి వేతనాలను ఇప్పటివరకు చెల్లించలేదు. మార్చి నెల కూడా ముగుస్తోంది. తమకు ఇచ్చే వేతనాలే తక్కువ. అవి కూడా సకాలంలో చెల్లించకపోవడం వల్ల కుటుంబాలను పోషించుకోలేక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని క్షేత్ర సహాయకులు ఆవేదన పడుతున్నారు.

రెగ్యులర్ చేసేదెప్పుడు ?

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికలకు ముందు క్షేత్ర సహాయకులను రెగ్యులర్ చేస్తానని ప్రకటించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజులు అయినా ఇప్పటి వరకు ఆ వాగ్దానం అమలు కాకపోవడం పట్ల క్షేత్ర సహాయకులు విచారం వ్యక్తం చేస్తు న్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తమను ఏ మాత్రం పట్టించుకోలేదని, ప్రస్తుత ప్రభుత్వం అయినా తమను ఆదుకోవాలని క్షేత్ర సహాయకులు కోరుతున్నారు. ప్రతీ గ్రామ పంచాయతీకి ఒక క్షేత్ర సహాయకుడిని నియమంచి పని భారం తగ్గించాలని, కనీస వేతనం రూ.21వేలు చెల్లించాలని, 30శాతానికిపైగా కూలీల హాజరు తప్పనిసరి నిబంధనను తొలగించాలని, ప్రతీ నెల వేతనాలను చెల్లించాలని, ప్రస్తుతం బకాయి ఉన్న మూడు నెలల వేతనాలను తక్షణమే చెల్లించాలని, తమ సర్వీస్‌ను రెగ్యులర్ చేయాలని క్షేత్ర సహాయకులు కోరుతున్నారు.

జాతీయ వైద్య సదస్సుకు డాక్టర్ కూరపాటి రమేష్‌కు ఆహ్వానం



వరంగల్ మెడికల్, మార్చి 28: ఢిల్లీలో ఈ నెల 29, 30 తేదీలల్లో జరుగనున్న హెర్నియా నేషనల్ కాన్ఫరెన్స్‌లో పాల్గొనేందుకు వరంగల్‌కు చెందిన డాక్టర్ కూరపాటి రమేష్‌కు ఆహ్వానం అందింది. ఈ మేరకు గురువారం డాక్టర్ కూరపాటి రమేష్ వివరాలను వెల్లడించారు. సంక్లిష్టమైన అడ్వాన్స్ లాపరోస్కోపిక్ ఆపరేషన్స్ నూతన వైద్య విధానంపై అవగాహన సదస్సులో ప్రసంగం ఉంటుందని పేర్కొన్నారు. నూతన వైద్యవిధానాల వల్ల ఖర్చు తగ్గడమే కాకుండా త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. కాగా, డాక్టర్ రమేష్‌కు ఆహ్వానం అందడంపై ఐఎంఏ ప్రతినిధులు, వరంగల్ సర్జికల్ అసోసియేషన్ సభ్యులు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

కాంగ్రెస్ మేనిఫెస్టో సభ్యుడిగా రియాజ్



హనుమకొండ సిటీ, మార్చి 28: కాంగ్రెస్ జాతీయ మేనిఫెస్టో కమిటీ సభ్యుడిగా టీపీసీసీ అధికార ప్రతినిధి, గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రియాజ్ నియమితులయ్యారు. హనుమకొండ జిల్లాకు చెందిన డాక్టర్ రియాజ్‌కు ఏడుగురు సభ్యులతో కూడిన కమిటీలో స్థానం కల్పించారు. ఈ మేరకు టీపీసీసీ అధ్యక్ష హోదాలో రేవంత్‌రెడ్డి కమిటీని ఏర్పాటు చేశారు. రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు చైర్మన్‌గా ఉన్న కమిటీ రానున్న లోక్‌సభ ఎన్నికల క్రమంలో ప్రజల వద్దకు వెళ్లనుంది. 15 రోజుల వ్యవధిలో ప్రజాభిప్రాయాలను సేకరించి ఏఐసీసీకి తెలియచేయనుంది.

మంద కృష్ణను కలిసిన అరూరి రమేష్


అరూరిని సన్మానిస్తున్న మంద కృష్ణ

హనుమకొండ టౌన్, మార్చి28: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగను వరంగల్ బీజేపీ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేశ్ గురువారం హనుమకొండలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అరూరిని మంద కృష్ణ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

న్యూశాయంపేటలో కుక్కల స్వైర విహారం


గాయపడిన బాలిక

న్యూశాయంపేట, మార్చి 28: గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థ 31వ డివిజన్ న్యూశాయంపేటలో గురువారం కుక్కలు స్వైర విహారం చేశాయి. న్యూశాయంపేటలోని పద్మశాలీ కాలనీకి చెందిన గుండు శరణ్య అనే బాలికను అలాగే రాసమల్ల వాడకు చెందిన పాలబిందల కనకలక్ష్మీ అనే వృద్ధురాలిపై గురువారం కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. వెంటనే బాధితులు స్థానిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించుకున్నారు. న్యూశాయంపేటలోని ప్రతీ కాలనీలో పదుల సంఖ్యలో కుక్కలు సంచరిస్తున్నాయని, మునిసిపల్ సిబ్బందికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు సిబ్బందిని పంపించి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యం

చెన్నారావుపేట, మార్చి 28: మండలంలోని గురిజాల గ్రామానికి చెందిన ఓ మహిళ ఇద్దరు పిల్లలతో సహా అదృశ్యమైనట్లు ఎస్సై గూడ అరుణ్‌కుమార్ గురువారం తెలిపారు. వరంగల్ ఏనుమాములకు చెందిన దివ్యకు గురిజాలకు చెందిన దౌడు రాజుతో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి మూడేళ్ల , ఏడాది వయసున్న వర్షిణి, పప్పి ఉన్నారు. రాజు స్థానిక ప్రైవేటు స్కూల్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. రాజు మద్యానికి బానిసై నిత్యం ఇంట్లో గొడవకు దిగేవాడు. దీంతో విసుగు చెందిన దివ్య బుధవారం ఇంట్లో ఎవరికి చెప్పకుండానే ఇద్దరు పిల్లలను తీసుకొని వెళ్లిపోయింది. బంధువుల ఇంట్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దివ్య తల్లి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

పోచమ్మమైదాన్‌లో భారీ అగ్ని ప్రమాదం

● చౌరస్తా సమీపంలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో చెలరేగిన మంటలు ● షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైన బ్యాంకెట్ హాల్, ఇన్సూరెన్స్ కార్యాలయం


దగ్ధమవుతున్న షాపింగ్ కాంప్లెక్స్‌లో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పోచమ్మమైదాన్, మార్చి 28: వరంగల్ నగరం నడిబొడ్డున పోచమ్మమైదాన్ చౌరస్తా సమీపంలోని ఓ షాపింగ్ కాంప్లెక్స్‌లో గురువారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం జరిగింది. షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా చెలరేగిన మంటలు... కాంప్లెక్స్‌లోని మూడు అంతస్తులకూ వ్యాపించాయి. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం. వరంగల్ పోచమ్మమైదాన్ చౌరస్తా సమీపంలోని జకోటియా షాపింగ్ కాంప్లెక్స్‌లో రెండో అంతస్తులో ఉన్న ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కార్యాలయంలో గురువారం రాత్రి ఏడు గంటల సమయంలో షార్ట్‌సర్క్యూట్ జరిగింది. పొగరావడం గమనించిన సిబ్బంది భయంతో బయటకు పరుగులు తీశారు. అనంతరం కాంప్లెక్స్‌లోని మిగతా షాపుల నిర్వాహకులను అప్రమత్తం చేశారు. కాసేపటికే ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కార్యాలయం పూర్తిగా మంటలు వ్యాపించి ఎగిసిపడ్డాయి. మూడో అంతస్తులో ఉన్న బ్యాంకెట్‌హాల్‌లోకి కూడా మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని అర్ధరాత్రి వరకు మంటలను ఆర్పేందుకు యత్నించారు. ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, డీసీపీ దేవేందర్‌రెడ్డితో పాటు ఐదుగురు సీఐలు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించారు. ప్రమాదం సంభవించిన చోట ప్రజలు పెద్ద ఎత్తున గుమికూడటంతో వారిని అదుపుచేయడం కష్టంగా మారింది. దీంతో పోలీసులు పలుమార్లు స్థానికులను చెదరగొట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే మంటలకు కాంప్లెక్స్‌లోని ఏసీ కంప్రెషర్లు అన్నీ పేలగా.. ఆశబ్దాలకు జనం భయాందోళనకు గురయ్యారు. అప్రమత్తమైన అధికారులు వెంటనే విద్యుత్తు సరాఫరాను నిలిపివేశారు.

మూడు ఫైరింజన్లు, మునిసిపల్ వాటర్ ట్యాంకర్లతో....

మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ఫైర్ సిబ్బంది శ్రమించారు. మూడు ఫైరింజన్లతో మూడు వైపులా నుంచి నీటిని చిమ్మినా మంటలు అదుపులోకి రాలేదు. ఈ క్రమంలోనే మునిసిపల్ వాటర్ ట్యాంకర్లతో సైతం నీటిని తీసుకువచ్చి మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు యత్నించారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. రెండు కోట్లకు పైగా ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో స్థానికులు, పరిసరాల్లో నివాసం ఉండే వారు భయాందోళనకు గురవగా.. ఘటన జరిగిన ప్రాంతానికి సమీపంలో పెట్రోల్ పంపులు కూడా ఉండటంతో అందరూ ఆందోళనకు గురయ్యారు.

ఘటనా స్థలానికి మంత్రి సురేఖ

ఘటనా స్థలాన్ని దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ సందర్శించారు. ఘటన విషయం తెలుసుకున్న మంత్రి హుటాహుటిన తరలివచ్చి అధికారులతో మాట్లాడారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. కలెక్టర్ ప్రావీణ్య, మునసిపల్ కమిషనర్ అశ్విని తానాజీవాకడే ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

అస్వస్థతకు గురైన సీఐ గోపి

మంటలను అదుపుచేసే అక్రమంలో మట్వాడ సీఐ గోపి అస్వస్థతకు గురయ్యారు. ఎగిసిపడుతున్న మంటలను భారీ స్థాయిలో పొగలు విరజిమ్మడంతో శ్వాస సంబంధ సమస్య తలెత్తి అస్వస్థతకు గురవడంతో వెంటనే ఆయన్ను ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా.. గోపి చికిత్స పొందుతున్నారు.


కాంప్లెక్స్ వద్ద గుమికూడిన ప్రజలు



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి కొండా సురేఖ, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య, బల్దియా కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే

దళిత యువకుడిపై దాష్టీకం

కూతురిని ప్రేమించాడని చితకబాదిన వైనం
టాస్క్‌ఫోర్స్ పోలీసుల అదుపులో ముగ్గురు వ్యక్తులు
వరంగల్ జిల్లా నర్సంపేటలో ఆలస్యంగా వెలుగులోకి ఘటన

నర్సంపేట టౌన్, మార్చి 28 : ప్రేమ వ్యవహారంలో ఓ దళిత యువకుడిని కొందరు వ్యక్తులు చితకబాదగా.. ఈ కేసులో వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణానికి చెందిన ముగ్గురిని వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలిలావున్నాయి.

నర్సంపేట పట్టణానికి చెందిన బీసీ సామాజిక వర్గానికి చెందిన యువతి, మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని చర్లపాలెం గ్రామానికి చెందిన ఓదళిత యువకుడు ధర్మవరపు ప్రకాష్‌రాజ్ కొన్నేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఈ క్రమంలో తరుచూ ఆ యువకుడు నర్సంపేట వెళుతూ పట్టణంలో నివాసం ఉంటున్న యువతిని కలిసే వాడు. ఈ క్రమంలో వీరి ప్రేమ వ్యవహారం యువతి ఇంట్లో తెలిసి ప్రకాష్‌రాజ్‌ను మందలించారు. అయినా వారిద్దరూ ప్రేమించుకుంటూనే ఉండటంతో యువతి తండ్రి ప్రకాష్‌రాజ్‌ను తన కూతురికి దూరం చేయాలని భావించి.. తన స్నేహితులైన మాజీ ప్రజాప్రతినిధి, రియల్ ఎస్టేట్ వ్యాపారితోపాటు మరో ఇద్దరు కలిసి పథకం రూపొందించారు.

ఈ నెల 24న యువతి సెల్‌ఫోన్ నుంచి ప్రకాష్‌రాజ్‌కు 'ఇంట్లో ఎవరూలేరని నీవు రా' అంటూ మెసేజ్ పంపారు. తన ప్రియురాలే ఆ మెసేజ్ చేసిందనుకొని నర్సంపేటకు వచ్చిన ఆ యువకుడిని యువతి తండ్రి, అతడి స్నేహితులు చావబాది, యువకుడితోనే 100కు డయల్ చేసి, తాను యువతి ఇంట్లోకి దొంగతనానికి వచ్చానని, ఇదే సందర్భంలో గాయాలయ్యాయని చెప్పాలని బెదిరించి మరీ పోలీసులకు ఫోన్ చేయించారు.

దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని యువకుడిని ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించి విచారణ చేయగా అతడు జరిగిన విషయాన్ని పోలీసులకు వివరించాడు. పోలీసులు యువకుడి తండ్రికి సమాచారం అందించగా.. ఈ విషయంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో యువకుడి తండ్రి ఫిర్యాదు చేశారు. అయితే దళిత యువకుడిపై జరిగిన దాడిని పరువుదాడిగా భావించిన దళిత సంఘాలు పోలీసు ఉన్నతాధికారులను ఆశ్రయించారు. ఆ తర్వాత వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు యువకుడిని చితకబాదిన ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు తెలిసింది. ఇదిలావుండగా ముగ్గురిని అదుపులోకి తీసుకున్న వారిని ప్రేమ వ్యవహారంతోపాటు భూ దందాలు, సెటిల్‌మెంట్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలపై సైతం టాస్క్‌ఫోర్స్ పోలీసులు విచారణ చేస్తున్నట్లుతెలిసింది. ఈ విషయంపై స్థానిక టౌన్ సీఐ రమణమూర్తిని సంప్రదించగా.. ఈ ఘటన గురించి తన దృష్టికి రాలేదన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న కేయూ మాజీ వీసీ ప్రొఫెసర్ వెంకటరత్నం

సాంకేతిక తోడ్పాటుతోనే వాణిజ్యాభివృద్ధి

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 28: వాణిజ్యాభివృద్ధిలో సాంకేతిక పరిజ్ఞానం ఎంతగానో ఉపయోగపడుతుందని కేయూ మాజీ వీసీ ప్రొఫెసర్ వెంకటరత్నం అన్నారు. గురువారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 'ఫిన్‌టెక్ రెవల్యూషన్' అనే అంశంపై జరుగుతున్న జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ వెంకటరత్నం మాట్లాడుతూ... ఆధునిక సాంకేతిక రంగంలో వస్తున్న వినూత్నమైన టెక్నాలజీతో ప్రపంచ వర్తక, వాణిజ్య సులభతరమైందన్నారు. మారిన ప్రపంచానికి అనుగుణంగా వాణిజ్య రంగం రూపాంతరం చెందడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేవారు.

కేయూ మాజీ రిజిస్ట్రార్ సాయిలు మాట్లాడుతూ... కొవిడ్ తర్వాత ఆన్‌లైన్‌లో వర్చువల్ సదస్సులు నిర్వహించుకోవడాన్ని ఆయన గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో యూజీసీ కోఆర్డినేటింగ్ ఆఫీసర్ ప్రొఫెసర్ మల్లికార్జున్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, రిటైర్డ్ ప్రొఫెసర్లు రాజిరెడ్డి, సత్రియా, కృష్ణమాచారి, సెమినార్ డైరెక్టర్ డాక్టర్ కనకయ్య, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వరలక్ష్మి, ప్రొఫెసర్లు కృష్ణారెడ్డి, రాజేందర్, అమరవేణి, డాక్టర్ ప్రగతి, డాక్టర్ రజని, డాక్టర్ సాయిచరణ్, డాక్టర్ సురేష్, డాక్టర్ గిరిప్రసాద్, డాక్టర్ సునిత, డాక్టర్ సరిత, డాక్టర్ రమాదేవి, డాక్టర్ నిరంజన్, డాక్టర్ నరేందర్, పీఆర్వో ఆదిరెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ టికెట్ దళిత క్రిస్టియన్లకే కేటాయించాలి


ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న పాస్టర్ ఐజక్

వడ్డెపల్లి, మార్చి 28: వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ టికెట్ దళిత క్రిస్టియన్ సామాజిక వర్గానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణకు కేటాయించాలని ట్రినిటీ క్రిస్టియన్ ఫెలోషిప్ అధ్యక్షుడు పాస్టర్ ఐజక్, ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గేను, ఏఐసీసీ నేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీని కోరారు. గురువారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు ట్రినిటీ క్రిస్టియన్ ఫెలోషిప్ ఉపాధ్యక్షుడు పాస్టర్ జోసఫ్ ప్రభాకర్ మాట్లాడారు. వరంగల్ లోక్‌సభ నియోజకవర్గంలో దళిత క్రిస్టియన్లు అధికంగా ఉన్నారని, డాక్టర్ రామకృష్ణకు టికెట్ కేటాయిస్తే ఇతర సామాజిక వర్గాలను కలుపుకొని అధిక మెజారిటీతో గెలిపించుకుంటామని అన్నారు. సమావేశంలో ట్రినిటీ క్రిస్టియన్ ఫెలోషిప్ ప్రతినిధులు సువర్ణరాజ్, లాజరెస్, తాళ్లపెల్లి ప్రసంగి, డేవిడ్, పాస్టర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులపై దాడి

వరంగల్ క్రైం, మార్చి 28: జిల్లాలోని పలుచోట్ల బెల్టు షాపులపై టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి రూ.1లక్ష విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నారు. గురువారం టాస్క్ ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ ఆధ్వర్యంలో కేయూసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుబ్బాయిపల్లి, ఎల్కతుర్తి మండలం పరిధిలోని కేశవపూర్, దామెర గ్రామాల్లో దాడులు నిర్వహించారు. మద్యం స్వాధీనం చేసుకుని ఐదుగురిపై కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని ఏసీపీ మధుసూదన్ ధృవీకరించారు.

వ్యక్తి అదృశ్యం

వరంగల్ క్రైం, మార్చి 28: కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని జవహర్‌కాలనీ వాస్తవ్యుడైన పూజారి శంబు ప్రసాద్(48) బుధవారం రాత్రి ఇంటి నుంచి బయటిక వెళ్లి తిరిగిరాలేదు. ఈయనకు ఇటీవలే బ్రెయిన్ సర్జరీ జరగడంతో అనారోగ్యంతో ఉన్నాడు. అతడికి ఏమీ గుర్తుకు ఉండటం లేదు. ఈ విషయాన్ని కేయూ ఎస్ఐ దేవేందర్ ధృవీకరించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 8712685088 నంబర్‌కు తెలుపగలరని ఆయన సూచించారు.

వీరభద్రస్వామి హుండీ ఆదాయం రూ.21.45 లక్షలు



కురవి వీరభద్రస్వామి దేవాలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

కురవి, మార్చి 28 : కురవి శ్రీ వీరభద్రస్వామి హుండీ ఆదాయం రూ.21,45,143 లభించినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి సత్యనారాయణ తెలిపారు. మార్చి 2 నుంచి 27వ తేదీ వరకు లభించిన ఆదాయాన్ని గురువారం లెక్కించినట్లు వెల్లడించారు. వీరభద్రస్వామి హుండీ ద్వారా రూ.15,90,693, భద్రకాళి అమ్మవారి హుండీ ద్వారా రూ.5,56,450 లభించినట్లు తెలిపారు. ఈ లెక్కింపులో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ నందనం కవిత, సిబ్బంది పాల్గొన్నారు.

వెంకన్న హుండీ ఆదాయం రూ.92,625

నర్సింహులపేట, మార్చి 28 : మండల కేంద్రంలో ఇంద్రకీలాద్రి పర్వతంపై వెలిసిన శ్రీ వేంకటేశ్వర స్వామి హుండీలను ఆలయ కార్యనిర్వహణ అధికారి వేణుగోపాల్ పర్యవేక్షణలో గురువారం దేవస్థానంలో లెక్కించారు. ఆలయంలోని ఐదు హుండీలను లెక్కించగా రూ.92,625ల ఆదాయం వచ్చిందని వేణుగోపాల్ తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ పరిశీలకులు నందనం కవిత, అసిస్టెంట్ మార్క శేఖర్, అర్చకులు శ్రీనందనాచార్యులు, రామాచార్యులు సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి దేవాలయానికి గంట బహూకరణ



దేవాలయానికి గంటను బహూకరిస్తున్న రోహిణి, నరేందర్ దంపతులు

మహబూబాబాద్ టౌన్, మార్చి 28: మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు గోపాలపురంలోని శ్రీపెద్దమ్మ తల్లి, రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయానికి రూ.9,600 విలువైన 5.5 కిలోల లోహంతో తయారు చేసిన గంటను పట్టణంలోని శ్రీవెంకటేశ్వర బజారుకు చెందిన మేక రోహిణి-నరేందర్ దంపతులు బహూకరించారు. దేవాలయంలో మేక రోహిణి-నరేందర్ గురువారం ప్రత్యేక పూజలు చేసి గంటను అందజేశారు. అనంతరం వారిని శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో శ్రీపెద్దమ్మతల్లి దేవాలయ ట్రస్ట్ చైర్మన్ గుండెల రాజు, కార్యదర్శి ముత్యాల శ్రీనివాస్, కోశాధికారి భూముల వెంకన్న, డైరెక్టర్లు భూముల శ్రీరాములు, తోట యాదగిరి, పులుగుజ్జు ఐలయ్య, అలువాల వెంకన్న, వేములకొండ ఐలయ్య, కట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షోత్సవాలు

నెల్లికుదురు, మార్చి 28 : నెల్లికుదురు అంగన్‌వాడీ సెక్టార్‌లో పోషణ పక్షం ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు, గర్భిణులకు సీమంతాలు, పిల్లలకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో హైమావతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారం గర్భిణులు తీసుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. బాల్యవివాహాలు, భ్రూణ హత్యలను నివారించాలన్నారు. కార్యక్రమంలోసూపర్‌వైజర్లు నాగమణి, సంధ్య, ఉషారాణి, విజయ, టీచర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మురళీనాయక్ వాహనం తనిఖీ



ఎమ్మెల్యే వాహనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

నెల్లికుదురు, మార్చి 28: నెల్లికుదురు క్రాస్‌రోడ్డులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద ఎమ్మెల్యే మురళీనాయక్ వాహనాన్ని గురువారం తనిఖీ చేశారు. ఎమ్మెల్యే మురళీ నాయక్ రత్తిరాంతండాకు వివాహ వేడుకలకు వెళ్తున్న క్రమంలో వాహనాన్ని నిలిపి ఏఎస్సై వెంకన్న, అధికారులు చంద్రమోహన్, అశోక్, కిరణ్ తనిఖీ చేసి పంపించారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

- దంతాలపల్లి మండలంలో బొలేరో బోల్తాపడి డ్రైవర్
- మచ్చర్ల వద్ద బైక్‌ను ట్యాంకర్ ఢీకొని ఒకరు
- హైదరాబాద్‌లో మాజీ సర్పంచ్ మరణం



దాట్ల అవులోను కుంట కట్టపై మృతి చెందిన లునావత్ నగేష్



మచ్చర్ల వద్ద ప్రమాదంలో మృతి చెందిన కుంటం శివకుమార్

దంతాలపల్లి, మార్చి 28:జిల్లాలో వివిధ ప్రాంతాల్లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని దాట్లకు వెళ్లే అవులోను కుంట కట్టపై గురువారం ప్రమాదవశాత్తు ఓ బొలెరో వాహనం అదుపు తప్పింది. దీంతో వాహనంలో ప్రయాణిస్తున్న వాల్యాతండా గ్రామ శివారు కొత్తతండాకు చెందిన బొలెరో డ్రైవర్ లునావత్ నగేష్(21) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరు మరిపెడ మండలంలోని ఎల్లంపేటకు ఓ కార్యానికి వెళ్లి, తిరుగు ప్రయాణంలో వస్తుండగా ఈ ఘటన నెలకొంది. మృతుడు లునావత్ నగేష్ వరంగల్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గాయాల పాలైన నలుగురు కొత్తతండాకు చెందిన గుగులోతు అంజీ, బానోతు రాజేష్, లునావత్ సాయికుమార్, లునావత్ వెంకటేష్‌లను 108 అంబులెన్స్‌లో మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, కొత్తతండాకు చెందిన లూనావత్ రాములు-లక్ష్మిలకు ఇద్దరు కుమారులు. బొలెరో వాహనం ఘటనలో మృతి చెందిన పెద్ద కుమారుడు లునావత్ నగేష్ అవివాహితుడు. నగేష్ కుటుంబంతో పాటు తీవ్ర గాయపడ్డ నలుగురు అంజీ, రాజేష్, వెంకటేష్, సాయికుమార్ వరంగల్‌లోనే కూలీ పనులు చేస్తున్నారు. సంఘటనా స్థలానికి స్థానిక పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

● గూడూరు : గూడూరు మండలం మచ్చర్ల వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై నగేష్ తెలిపిన ప్రకారం.... వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన కుంటం శివకుమార్(55) అతని స్నేహితుడు గడ్డం అశోక్ కలిసి ద్విచక్ర వాహనంపై మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం గురిమిళ్లలోని శుభకార్యానికి హాజరయ్యారు. స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా గూడూరు మండలం మచ్చర్ల స్టేజీ సమీపంలోకి రాగానే బైక్ అదుపు తప్పి కిందపడ్డారు. ఈ క్రమంలో గూడూరు నుంచి మహబూబాబాద్ వైపు వెళ్తున్న పెట్రోల్ ట్యాంకర్ ఒక్కసారిగా ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో కుంటం శివకుమార్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందగా.. అతని స్నేహితుడు అశోక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అశోక్‌ను 108 ద్వారా మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా, శివకుమార్ మృతదేహాన్ని గూడూరుకు పోస్టుమార్టంకు తరలించారు. శివకుమార్‌కు భార్య జమున, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

హైదరాబాద్‌లో మాజీ సర్పంచ్ మృతి



సూరయ్య (ఫైల్)

కేసముద్రం, మార్చి 28 : కేసముద్రం మండలం ధన్నసరి మాజీ సర్పంచ్ బందారపు సూరయ్య(63) హైదరాబాద్‌లో గురువారం ఉదయం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం... హైదరాబాద్ కుషాయిగూడలో ఉంటున్న తన కుమారుడి వద్దకు కొద్ది రోజుల క్రితమే సూరయ్య వెళ్లారు. ఉదయం రోడ్డు వెంట వాకింగ్ చేస్తుండగా వెనుక నుంచి జీహెచ్ఎంసీ చెత్త సేకరణ వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన 2009లో ధన్నసరి సర్పంచ్‌గా టీడీపీ తరఫున ఎన్నికయ్యారు. ఆయనకు భార్య సుజాత, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

బయ్యారం, మార్చి 28 : బయ్యారం పోలీస్‌స్టేషన్‌ను గురువారం రాత్రి జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొద్ది రోజులుగా బయ్యారం పోలీస్‌స్టేషన్ నందు అడిషనల్ ఎస్పీ చేతన్ నితిన్ ట్రైనీగా విధులు నిర్వర్తిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఎస్పీ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. దీంతో పాటు ట్రైనీ ఎస్సైగా అడిషనల్ ఎస్పీ చేతన్ నితిన్ చేపడుతున్న విధులను పరిశీలించారు. కేసుల పరిశీలన, రికార్డుల మెయింటెనెన్స్, తీసుకుంటున్న చర్యలు తదితర అంశాల్లో ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలన జరిపినట్లు తెలిసింది. కార్యక్రమంలో మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు, బయ్యారం సీఐ రవికుమార్, అడిషనల్ ఎస్పీ, ట్రైనీ ఎస్సై చేతన్ నితిన్, ఎస్సై మౌలానా, సిబ్బంది పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక




చిదిరాల నవీన్‌కుమార్, తమ్మి రమేష్

తొర్రూరు, మార్చి 28 : లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు లయన్స్ క్లబ్ చార్టర్డ్ ప్రెసిడెంట్ డాక్టర్ కె. రాజేందర్ రెడ్డి డివిజన్ కేంద్రంలో జరిగిన సమావేశంలో తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు 2024-25 సంవత్సరానికి కొత్త కమిటీని ఎంపిక చేశామన్నారు. నూతన అధ్యక్షుడిగా చిదిరాల నవీన్ కుమార్, కార్యదర్శిగా తమ్మి రమేష్, కోశాధికారిగా బోనగిరి శంకర్, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ రాంనర్సయ్య, నాళ్ల కృష్ణమూర్తి, పెరుమాండ్ల రమేష్, సహాయ కార్యదర్శిగా ముడుపు రవీందర్‌రెడ్డి, సోమ రాజశేఖర్‌లను ఎంపికచేశామన్నారు. సమాజంలో పేద ప్రజలకు అవసరమయ్యే సేవా కార్యక్రమాలు చేపడుతూ ప్రజల మన్ననలు పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు వీరభద్రరావు, ఉపేందర్‌రావు, రేగూరి వెంకన్న, సురేష్, వెంకటేశ్వర్లు, ప్రవీణ్, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అసత్య ప్రచారం మానుకోవాలి

మరిపెడ, మార్చి 28 : ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్‌పై కొందరు సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారం చేయడం మానుకోవాలని మరిపెడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెండ్లి రఘువీర్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం ఆయన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక విలేఖరులతో మాట్లాడారు. రాంచంద్రునాయక్‌ను గెలిచాక నియోజకవర్గంలోని ప్రతీ బూత్ లెవల్‌లో రూ.5 లక్షల సీసీ రోడ్లను మంజూచేయించారని అన్నారు. ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు చేస్తే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సహించరని ఆయన పేర్కొన్నారు.

మొక్కజొన్న చేను దగ్ధం

బయ్యారం, మార్చి 28 : మండలంలోని సాంబ తండాలో గురువారం అగ్ని ప్రమాదంలో మొక్కజొన్న చేను దగ్ధమైంది.స్థానికులు, బాధిత రైతులు తెలిపిన ప్రకారం... సాంబ తండాకు చెందిన రైతులు శ్రీరాములు, మంగీలాల్, లష్కర్ తమ చేనులో మొక్కజొన్న పంట సాగు చేశారు. ఈ క్రమంలోనే ప్రమాదవశాత్తు చేనుకు అగ్గి అంటుకోవటంతో పంట పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లినట్లు సమాచారం. కాగా, అటవీ ప్రదేశంలో తునికాకు మోడెం కాలబెడుతుండగా.. ప్రమాదవశాత్తు పక్కనే గల మొక్కజొన్న చేనుకు అంటుకున్నట్లు తెలుస్తోంది.

గుండెపోటుతో సీపీఐ నేత కన్నుమూత

గార్ల, మార్చి 28 : మండలంలని మద్దివంచలో సీపీఐ సీనియర్ నాయకుడు పాతురి రామయ్య గుండెపోటుతో గురువారం ఉదయం చనిపోయారు. రోజు వారి పనులను ముగించుకొని భోజనం చేసి నిద్రకు ఉపక్రమించన రామయ్య తెల్లవారు జామున ఒక్కసారిగా గుండె నొప్పి రావడంతో కుటుంబ సభ్యలు ఖమ్మంలోని ఓప్రైవేటు ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తున్న సమయంలో మృత్యువాత పడ్డాడు. రామయ్య మృతి వార్త తెలియగానే సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, సీపీఐ రాష్ట్ర కమిటీ నాయకుడు కట్టెబోయిన శ్రీనివాస్, రాగం రమేష్, పిచ్చయ్య, భిక్షమయ్య, ఉప సర్పంచ్ లావుడ్య భీముడు రామయ్య భౌతిక కాయాన్ని సందర్శించారు. పూల మాలలు వేసి నివాళులర్పించారు.

కష్టాలను ధైర్యంతో ఎదుర్కోవాలి

మరిపెడ, మార్చి 28 : ప్రతి ఒక్కరూ కష్టాలను ధైర్యంతో ఎదుర్కోవాలని ఆత్మహత్యల నివారణ కమిటీ ఛైర్మన్, చైల్డ్ వెల్ఫేర్ మెంబర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. గురువారం మరిపెడ పీఎస్‌లో ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన ఆత్మహత్యల నివారణపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. చిన్న చిన్న సంఘటనలకు బయపడి ఆత్మహత్యలు చేసుకోవద్దన్నారు. ఎంత పెద్ద సమస్యయైన కాలం పరిష్కరిస్తుందని గుర్తుచేసుకోవాలన్నారు. జీవితం ఎంతో గొప్పదన్నారు. కార్యక్రమంలో ఆత్మహత్యల నివారణ పోస్టర్లను స్థానిక ఎస్సైలు తహెర్, సంతోష్‌లతో కలిసి ఆవిష్కరించారు.

వేతనాలు చెల్లించాలని
మునిసిపాలిటీ ఎదుట ధర్నా



మునిసిపాలిటీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కూలీలు

తొర్రూరు, మార్చి 28 : తొర్రూరు మునిసిపాలిటీ పరిధిలో చేపట్టిన పట్టణ ప్రగతిలో పనిచేసిన కూలీలు వేతనం చెల్లించాలని కోరుతూ గురువారం తొర్రూరులోని మునిసిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ 2022-23లో నిర్వహించిన 4వ విడత పట్టణ ప్రగతిలో రోజువారి పనికోసం మునిసిపల్ అధికారులు పనికి పిలిచి 16రోజులు పనులు చేయించుకుని గత రెండు సంవత్సరాలుగా చేసిన పనికి కూలీ డబ్బులు ఇవ్వడం లేదని ఆరోపించారు. పట్టణ ప్రగతిలో ఆన్‌లైన్ టెండర్‌లో మునిసిపల్ అధికారులు టెండర్‌లు పిలవగా కాంట్రాక్టర్ కూలీలతో పనులు చేయించుకుని ఇప్పటివరకు డబ్బులు చెల్లించకపోవడంతో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టామన్నారు. పనులు చేయించుకుని మునిసిపల్ అధికారులు డబ్బులు ఇవ్వకపోవడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత ఉన్నతాధికారులకు తెలిపినా పట్టించుకోవడంలేదని 16 రోజుల పాటు 128 మంది కూలీలు పనిచేశారని, వారందరికి సుమారు రూ.8లక్షలపై చిలుకు చెల్లించాల్సి ఉందన్నారు. కాంట్రాక్టర్‌ను అడిగితే మునిసిపల్ అధికారులే జాప్యం చేస్తున్నారని దాటవేస్తున్నారన్నారు. దీనిపై మునిసిపల్ ఏఈని వివరణ కోరగా టెండర్ పిలిచి పనులు చేయించామని బిల్లులు చెల్లింపులో జాప్యం జరిగిందని జిల్లా అధికారులతో మాట్లాడి బిల్లులు చెల్లింపులు చేపడతామన్నారు. ఏది ఏమైనా కూలీలతో పనులు చేయించుకుని డబ్బులు చెల్లించకపోవడం సరికాదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో కూలీలు, వెంకటమ్మ, పద్మ, ఎల్లమ్మ 25 మంది మహిళా కూలీలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు



జమాండ్లపల్లిలో ఎస్సై దీపికరెడ్డి ఆధ్వర్యంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

మహబూబాబాద్ రూరల్, మార్చి 28 : మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు జమాండ్లపల్లి గ్రామంలో గురువారం రూరల్ ఎస్సై దీపికరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై దీపికరెడ్డి మాట్లాడుతూ... పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంత మైన వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలో ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కవాతులో ఏఎస్సై రమేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

● డోర్నకల్ : డోర్నకల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిలుక్కొయలపాడు, అందనాలపాడు, మోదుగుగడ్డ తండా, మన్నెగూడెంలలో గురువారం సీఐ ఉపేందర్‌రావు ఆధ్వర్యంలో పోలీసులు, కేంద్ర బలగాలతో కలిసి గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. ఎవరైనా అల్లర్లకు, బెదిరింపులకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సంతోష్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాపార కేంద్రంగా మరిపెడ అభివృద్ధి

మరిపెడ, మార్చి 28 : వ్యాపార కేంద్రంగా మరిపెడ మున్సిపాలిటీ అభివృద్ధి చెందుతుందని జిల్లా కాంగ్రెస్ నేత వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మరిపెడ బంగ్లాలో ఓ రెస్టారెంట్‌ను ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ గెలిచిన వంద రోజుల్లోనే మరిపెడ మునిసిపాలిటీ అభివృద్ధికి రూ.10కోట్ల అభివృద్ధి పనులకు ఎస్డీఎఫ్ నిధులను మంజూరి చేయించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మరిపెడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రఘువీర్‌రెడ్డి, ఎస్కే.అఫ్జల్, ఐలిమల్లు, ఆర్య వైశ్య సంఘ బాధ్యులు వెంకట్రామరావు, ప్రసాద్, రెస్టారెంట్ నిర్వాహకులు దీనేశ్‌రెడ్డి, వుల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 28: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విద్యుత్ శాఖ ఎస్ఈ జనగాం నరేష్ అన్నారు. మహబూబాబాద్‌లో గురువారం ఎస్సీ, ఎస్టీ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాటాడుతూ... భారతదేశంలో అంబేద్కరిజమే సమాజ అభివృద్ధికి దిక్సూచి అని పేర్కొన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచన విధానాన్ని మరింత లోతుగా అధ్యయనం చేసి, సమాజాభివృద్ధికి పునరంకితమయ్యే దిశలో పిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ ఈసం నారాయణ మాట్లాడుతూ... ప్రాథమిక విద్య నుంచి యూనివర్సిటీ చదువుల వరకు దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల విద్యార్థులే ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యనభ్యసిస్తూ ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుతున్నారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులు అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకొని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడాలన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి ప్రభాకర్, వీరస్వామి, పగడయ్య పాల్గొన్నారు.

తండ్రిని చంపిన కేసులో కుమారుడి రిమాండ్

డోర్నకల్, మార్చి 28: మండలంలోని జోగ్యతండాలో అనుమానాస్పదంగా తండ్రి మృతి చెందిన కేసులో కొడుకే నిందితుడిగా పోస్టుమార్టం నివేదికలో తేలినట్లు సీఐ ఉపేందర్‌రావు గురువారం తెలిపారు. జోగ్యతండాలో గత ఫిబ్రవరి 6న ఆంగోతు సేవ్య అనే వ్యక్తి తలకు తీవ్ర గాయాలు కావడంతో మృతి చెందాడని కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అపై మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బుధవారం పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా హత్య కేసుగా నిర్ధారించి కుటుంబ సభ్యులను విచారించగా సేవ్యను చంపింది కుమారుడు కుమార్‌గా తేలింది. విచారణలో సేవ్య మద్యానికి బానిసై కుటుంబ సభ్యులతో ప్రతినిత్యం ఘర్షణ పడుతుండే వాడని చెప్పారు. దీనికి తోడు అతని మానసిక పరిస్థితి మారుతుండేద, ఈ కారణంగానే కుమార్ తండ్రిపై దాడి చేయగా, మృతి చెందినట్లు చెప్పారు. కుమార్‌ను గురువారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

దంతాలపల్లి, మార్చి 28 : మండలంలోని కుమ్మరికుంట్ల బస్టాండ్ కాలనీ మహిళలు గురువారం తాగునీటి వసతి కల్పించాలంటూ ఖాళీ బిందెలతో రోడ్డెక్కి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, మహిళలు మాట్లాడుతూ గత వారం నుంచి గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రమైందన్నారు. గ్రామానికి భగీరథ పైప్‌లైన్ ద్వారా తాగు నీరు రావడం లేదన్నారు. వెంటనే సంబంధిత మండల అధికారులు తాగునీటి సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఉప్పమ్మ, ఉపేంద్ర, పద్మ, ఎంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



మాలోతు లాలు మృతదేహం

గూడూరు, మార్చి 28: మండలంలోని మదనాపురం శివారు దూపతండాలో గురువారం విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. గూడూరు ఎస్సై నగేష్ తెలిపిన వివరాల ప్రకారం... మదనాపురంకు చెందిన మాలోతు లాలు(45)కు 3.10 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో 1.10 ఎకరాల్లో వరి, రెండెకరాల్లో మిర్చి, పత్తి పంటలను సాగు చేశాడు. ఆ పంటలకు నీరందించేందుకు వ్యవసాయ క్షేత్రానికి వెళ్లాడు. మోటారు ఆన్ చేయగా నీరు రాకపోవడంతో బావిలోకి దిగి మోటారును పరిశీలిస్తుండగా ఒక్కసారిగా విద్యుదాఘాతంకు గురై బావిలో పడ్డాడు. గమనించిన చుట్టుపక్కల రైతులు లాలును బావిలో నుంచి బయటకు తీశారు. ఆ లోపుగానే లాలు మృతి చెందాడు. ఆయనకు భార్య పద్మ, కుమార్తెలు ప్రవళిక, రవళి, కుమారుడు రాజా ఉన్నారు. కాగా, భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువత స్వశక్తితో ఎదగాలి



బ్యూటీ పార్లర్‌ను ప్రారంభిస్తున్న గుడిపూడి నవీన్‌రావు

మరిపెడ, మార్చి 28 : యువత స్వశక్తితో ఆర్థికంగా బలోపేతం కావాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు అన్నారు. గురువారం మరిపెడ బంగ్లాలో ఓ హెయిర్ బ్యూటీ పార్లర్‌ను స్థానిక ఎంపీపీ అరుణరాంబాబుతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జర్పుల కాలునాయక్, కేలోత్ హరి, అజ్మీరా హరి, బొల్లం నర్సయ్య, దిగిజర్ల శ్రీను, గంధసిరి కృష్ణ, ముఖేశ్, సుందర్, మహిపాల్, చంద్రన్న, మునేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ అర్బన్ ఉపాధ్యక్షుడిగా సాయిరాజీవ్



మహబూబాబాద్ టౌన్, మార్చి 28: కాంగ్రెస్ పార్టీ అనుబంధ విద్యార్థి సంఘం ఎన్ఎస్‌యూఐ మహబూబాబాద్ అర్బన్ ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన పెనుగొండ సాయిరాజీవ్ నియామకమయ్యారు. మహబూబాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా పట్ల చందు, కేసముద్రం మండల ఉపాధ్యక్షుడిగా బి.యశ్వంత్, ప్రధాన కార్యదర్శిగా చీకటి ప్రశాంత్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, రాష్ట్ర ఇన్‌చార్జి అక్షయ్ లాక్రా గురువారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, తన నియామకానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి పట్టణ ఉపాధ్యక్షుడు పెనుగొండ సాయిరాజీవ్ కృతజ్ఞతలు తెలిపారు.

వాటర్ ఫ్రిజ్‌ల బహూకరణ



ప్రభుత్వ కార్యాలయానికి ఫ్రిజ్‌లను బహూకరిస్తున్న లక్ష్మణ్‌నాయక్

గార్ల, మార్చి 28 : ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు గార్ల మాజీ సర్పంచ్ గంగావత్ లక్ష్మణ్ నాయక్ తమ సొంత ఖర్చులు రూ.80వేలతో కొనుగోలు చేసిన నాలుగు ఫ్రిజ్‌లను గురువారం అందజేశారు. తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్, ఎస్‌బీఐ బ్యాంకు, ప్రభుత్వ ఆస్పత్రికి అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.రవీందర్, ఎస్సై నిమ్మతోట జీనత్ కుమార్, ఎస్‌బీఐ మేనేజర్ దిలీప్ కుమార్, డాక్టర్ చింత రమేష్, డీటీ సుధాకర్, గంగావత్ లక్ష్మణ్‌నాయక్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య



మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య

మహబూబాబాద్ టౌన్, మార్చి 28: జర్నలిస్టుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వారికి దక్కాల్సిన ప్రతిఫలాలు అందేలా యూనియన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అన్నారు. మహబూబాబాద్‌లో జర్నలిస్టు బందగి షోయబుల్లాఖాన్ ప్రాంగణంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ద్వితీయ మహాసభను గురువారం జిల్లా అధ్యక్షుడు మట్టూరి నాగేశ్వర్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ... జర్నలిస్టులు ఐకమత్యంతో ఉంటూ తమ హక్కులను సాధించుకోవాలని సూచించారు. అనంతరం యూనియన్ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మట్టూరి నాగేశ్వర్‌రావు, కార్యదర్శిగా కొమ్మనబోయిన యాకయ్య, కోశాధికారిగా వై.కిరణ్, ఉపాధ్యక్షులుగా పుల్లూరి ఉపేందర్, ఐలయ్య, శేఖర్, రాంమూర్తి, సహాయ కార్యదర్శులుగా ఉపేందర్, అమర్‌నాథ్, జి.కృష్ణవేణి, కృష్ణారెడ్డి, నిరంజన్, మహేందర్‌లతో పాటు 12 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ జాతీయ కార్యదర్శి పి.ఆనందం, రాష్ట్ర నేతలు బండి విజయ్, వెంకటేష్, శ్రీనివాస్, మా అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డుపల్లి ఉపేందర్, ఇనుగుర్తి సుధాకర్ పాల్గొన్నారు.

టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా కాశయ్యగౌడ్

చిన్నగూడూరు : టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ కౌన్సిల్ సభ్యుడిగా గురువారం చిన్నగూడూరు మండలం పగిడిపల్లి గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ భూపతి కాశయ్యగౌడ్ నియమితులైనట్టు రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల సోమయ్య తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతీ ఒక్కరికి కాశయ్య కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఆనందం, ఉపాధ్యక్షుడు విజయ్, నాగేశ్వరరావు, శ్రీనివాస్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.